నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 24 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

భక్తజన బాంధవుడు.. రంగనాథుడు

- శ్రీరంగాపూర్‌లో నేడు బ్రహ్మాండ నాయకుడి రథోత్సవం

రంగనాథస్వామి

పెబ్బేరు, మార్చి 23 : శ్రీరంగాపూర్‌లోని రంగనాథ స్వామి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా.. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్నది. భక్తజన బాంధవుడిగా.. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా పూజలందుకుంటున్న రంగనాథస్వామి రథోత్సవం ఆదివారం జరుగనున్నది. అయితే ఈ వేడుకలను పగటిపూట నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుంది. జాతర పక్షం రోజుల పాటు కొనసాగనుండగా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందజేసేందుకు శ్రీరంగాపురం సేవా సమితి ఏర్పాట్లు చేసింది. దశాబ్దాల కిందట వనపర్తి సంస్థానాధీశులు ఈ ఆలయాన్ని నిర్మించారు. శిల్పకళా నిలయంగా పేరుగాంచిన ఈ ఆలయం తమిళనాడు శ్రీరంగంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయాన్ని పోలి ఉంటుంది. చుట్టూ రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉండడంతో, నీటి మధ్యలోనున్న ఆలయం యాత్రికులను ఎంతో ఆకర్షిస్తున్నది. భారతీయ శిల్పకళకు దర్పణం పట్టేలా ఆలయంలోని ప్రతి శిల్పం జీవకళతో కనిపిస్తుంది. గర్భగుడిలో శ్రీదేవి, భూదేవీ సమేత రంగనాథుడు శయనిస్తూ కనిపిస్తాడు. రథోత్సవానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వైద్య బృందంతో మాట్లాడుతున్నఅద నపుకలె క్టర్ సంచిత్ గంగ్వార్

యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

- సిబ్బందినిరం తరంఅ ందుబాటులో ఉండాలి : వనపర్తిక లెక్టర్
- దంతనూరులోవైద్య శిబిరంఏర్పా టు
- గ్రామాన్ని సందర్శించి నివేదిక అందజేసిన అదనపు కలెక్టర్

మదనాపురం, మార్చి 23 : మండలంలోని దంతనూరులో ప్రబలిన విష జ్వరాలను నివారించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ అధికారులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కొన్ని రోజులుగా గ్రామస్తులు విష జ్వరాలతో బాధపడుతున్న క్రమంలో కలెక్టర్ శనివారం ఉదయం వెబ్‌ఎక్స్ మీటింగ్ నిర్వహించి జిల్లా వైద్య, రెవెన్యూ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాన్ని సందర్శించి నివేదిక ఇవ్వాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను ఆదేశించారు. మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య సిబ్బంది 24గంటలు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అవసరమైతే మరింత సిబ్బందిని పంపించేలా చూడాలన్నారు. ఇంటింటికీ తిరిగి రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి టీ హబ్ ల్యాబ్‌కు పంపించాలన్నారు. ఊరిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని నిల్వ నీటిని పారబోసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారిని ఆదేశించారు. గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ దంతనూరు గ్రామాన్ని సందర్శించి వైద్య శిబిరంలోని వైద్యులు, రోగులతో మాట్లాడారు. తదుపరి చర్యలపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈనెల 13న గ్రామంలో కొందరికి జ్వరాలు రావడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. నివేదికలో మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. తాగునీటిని సైతం పరీక్ష చేయించగా రిపోర్టు సాధారణం అని వచ్చినట్లు నివేదికలో పొందుపర్చారు.

పీడీఎస్ బియ్యం చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

- రూ.16లక్షల నగదు, 75 క్వింటాళ్ల బియ్యం, డీసీఎం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, మార్చి 23 : కొల్లాపూర్ నియోజకవర్గంలోని గోదాం నుంచి పీడీఎస్ బియ్యం దొంగిలించిన కేసులో పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌కు చెందిన రాచూరి సునీల్‌ను కోడేరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో సమావేశమై మాట్లాడారు. కోడేరు మండలంలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం, వరి బస్తాలు చోరీకి గురయ్యాయని ఈనెల 2వ తేదీన ఫిర్యాదు అందడంతో కోడేరు పీఎస్‌లో కేసు నమోదైందన్నారు. 2021-22 ఏడాది మధ్యకాలంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడగా శనివారం కొల్లాపూర్ సీఐ, కోడేరు ఎస్సైలు సాతాపూర్‌కు చెందిన మిల్లర్ యజమానిని అరెస్టు చేశారన్నారు. అతడి నుంచి రూ.16లక్షల నగదు, 75 క్వింటాళ్ల బియ్యం, డీసీఎం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇదే కేసులో గతంలో ఐదుగురిని అరెస్టు చేయగా సునీల్‌ను ఏ6గా కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఏ1గా పెద్దకొత్తపల్లికి చెందిన కేతనమోని రాంబాబు, ఏ2గా గడ్డి గోపుల పవన్‌కల్యాణ్, ఏ3గా పెద్దకారుపాములకు చెందిన చింతపల్లి అశోక్‌రెడ్డి, ఏ4గా పెద్దకారుపాములకు చెందిన బిల్లకంటి మణికంఠ, ఏ5గా మహబూబ్‌నగర్‌కు చెందిన ఫిరోజ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ముందుగా అరెస్టయిన ఐదుగురు ఏ6 అయిన సునీల్‌కు బియ్యాన్ని విక్రయించారన్నారు. వీరిలో ఏ2 పవన్ ఏఎంసీ గోదాంలో హమాలీగా పనిచేసేవాడని, ఏ1 రాంబాబు, ఏ3 అశోక్‌రెడ్డిలు పవన్‌కు స్నేహితులని, ఇంకా కేసు విచారణలో ఉన్నదని ఎస్పీ వెల్లడించారు.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

ఎమ్మెల్సీ సంసిద్ధం

- స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నికకు రెడీ
- ఉమ్మడి జిల్లాలో 28న పోలింగ్‌కు ఏర్పాట్లు
- 1,439 మంది ఓటర్లు.. 10 పోలింగ్ కేంద్రాలు
- తుది ఓటరు జాబితా ఖరారు చేసిన కలెక్టర్లు
- పోలింగ్, బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణపై శిక్షణ
- రాజకీయ పక్షాలకు అవగాహన కార్యక్రమం
- కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్‌కే సంఖ్యాబలం ఎక్కువ
- ఓటరు జారిపోకుండా రెండు పార్టీల యత్నాలు
- సీఎం రేవంత్ సొంత జిల్లాలో హైటెన్షన్

మహబూబ్‌నగర్, మార్చి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శాసనమండలి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఈనెల 28న పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 10 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉపఎన్నికకు సంబంధించిన ప్రక్రియపై అన్ని రాజకీయపక్షాలతో ఆయా జిల్లాల కలెక్టర్లు సమావేశమై అవగాహన కల్పించారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పద్ధతిన ఎన్నికలు నిర్వహిస్తుండడంతో సిబ్బందికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్‌ల సీలింగ్, ఇతరత్రా విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు. కాగా, ఉప ఎన్నికల్లో గెలుపునకు ఇటు బీఆర్ఎస్ అటు అధికార పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం బీఆర్ఎస్‌కు ఉండటంతో ఆ పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఓటర్లను కలుస్తున్నారు. అధికార పార్టీకి సంఖ్యాబలం లేకపోవడంతో ఇప్పటికే బీజేపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసి.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు కూడా గాలం వేస్తున్నది. ప్రచారంలో ఇరుపార్టీలు దూసుకుపోతుండడంతో గెలుపుపై అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక ప్రజాప్రతినిధుల శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున జీవన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ బరిలో నిలిచారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను క్యాంపులకు తీసుకెళ్లారు. అదేవిధంగా పోలింగ్ రోజు వారందరినీ ఆయా కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటర్లు జారిపోకుండా రెండు పార్టీలు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాయి.

ముమ్మరంగా ప్రచారం..

రాష్ట్రంలో అధికారం మారడంతో కాంగ్రెస్‌తోపాటు సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న బీఆర్ఎస్ శాసనమండలిపై కన్నేశాయి. అసెంబ్లీ ఎన్నికలకు మించి ఈ ఎన్నికల్లో ప్రచారం చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న తొలి ఉపఎన్నిక కావడంతో కాంగ్రెస్ నేతలు ఏకంగా బడా పారిశ్రామికవేత్తలను రంగంలోకి దింపి ఇతర పార్టీల ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు సమాచారం. కాగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఓటర్లను ఇతర రాష్ట్రాల్లో విహారయాత్రలకు తీసుకెళ్లి పోలింగ్ రోజు నేరుగా కేంద్రాలకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

అధికార పార్టీ తంటాలు..

అధికార పార్టీ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం నానా తంటాలు పడుతున్నది. ఓటర్లను భారీగా ప్రలోభపెడుతూ కేసులు పెడతామని బెదిరించి ఇతర పార్టీల నేతలను తమ వైపునకు లాక్కునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సీఎం సొంత జిల్లా కావడంతో ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పటికీ ఓటర్లంతా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కావడంతో ఏకంగా ఓ పారిశ్రామికవేత్తకు టికెట్ ఇచ్చి పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ఒక్కో ఓటుకు అధికార పార్టీ రూ.10లక్షలు ఇస్తామని బాహాటంగా ప్రకటిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రుల ఆధ్వర్యంలో అందరూ శిబిరాలకు తరలివెళ్లారు. వీరి పర్యవేక్షణను మాజీ ఎమ్మెల్యేలే చూస్తున్నారు. దీంతో ఓటమి ఖాయం అనుకున్న కాంగ్రెస్ పార్టీ బలప్రయోగానికి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోతే రాష్ట్రమంతా ప్రభావం పడే అవకాశం ఉందని పార్టీ నేతలు భయపడుతున్నారు. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలపై కూడా ఈ ఉపఎన్నిక ఫలితాలు ప్రభావం చూపుతాయని రాజకీయపక్షాలు భావిస్తున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎం ఎలాగైనా ఉప ఎన్నికల్లో గెలిచి తీరాలని, అవసరమైతే దేనికైనా సిద్ధంగా ఉండాలని పార్టీ నేతలను ఆదేశించినట్లు సమాచారం. ఎన్ని ప్రలోభాలు పెట్టినా బీఆర్ఎస్ నేతలు లొంగకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో టెన్షన్ మొదలైంది. బీఆర్ఎస్ నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో క్యాంపులకు తరలివెళ్లడంతో కాంగ్రెస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే ఈ ఉప ఎన్నిక ఉత్కంఠగా మారింది.

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

మహబూబ్‌నగర్	245
నారాయణపేట	205
కొడంగల్	56
వనపర్తి	219
నాగర్‌కర్నూల్	101
గద్వాల	225
కొల్లాపూర్	67
కల్వకుర్తి	72
షాద్‌నగర్	171
అచ్చంపేట	79
జెడ్పీటీసీలు	83
ఎంపీటీసీలు	888
మున్సిపల్ కౌన్సిలర్లు	449
ఎక్స్‌అఫీషియో సభ్యులు	19

ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు

శాసనమండలి ఉప ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు ముమ్మరం చేసింది. పట్టుబడిన నగదును కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీలు 24 గంటల్లో పరిశీలించి క్లియర్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీస్ యంత్రాంగం కూడా శాసనమండలి ఉపఎన్నికలు సజావుగా జరిగేందుకు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ఈ ఉప ఎన్నికల్లో మొత్తం 1,439 ఓటర్లు ఉండగా 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, కొడంగల్, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి, షాద్‌నగర్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

పెబ్బేరు పోలీసులఅదు పులో దొంగలు, స్వాధీనం చేసుకున్న డబ్బు

- రూ.1.55 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వనపర్తి ఎస్పీ హరిప్రసాద్ రెడ్డి

గొర్రెల దొంగలు అరెస్ట్

పెబ్బేరు, మార్చి 23 : మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సంతలో పోలీసులు ముగ్గురు గొర్రెల దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1.55లక్షల నగదు, ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా నందికొట్కూర్ మండలం కొల్లభాపురానికి చెందిన పాత నేరస్తుడు కావేటి శ్రీనివాసులు అలియాస్ డాన్ శ్రీను ఒక గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడిపై ఇప్పటికే 20 కేసులకు పైగా ఉన్నాయన్నారు. శనివారం అతడు సంతలో సంచరిస్తుండగా నిఘా ఉంచి అతడితోపాటు పాన్‌గల్ మండలం చింతకుంటకు చెందిన రామాంజి, ఎల్లస్వామిలను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు. పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి, రంగాపురం బైపాస్ వద్ద జరిగిన దొంగతనాల్లో వీరే నేరస్తులను తేలిందన్నారు. వీరి వద్ద నుంచి రూ.1.55 లక్షలలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించారు. దొంగలను అరెస్ట్ చేయడానికి కృషి చేసిన సిబ్బంది వెంకట్రాములు, నరసింహ, ఆనంద్‌ను ఆయన అభినందించారు.

రుద్రహోమంని ర్వహిస్తున్న వేద పండితులు

రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

మూసాపేట(అడ్డాకుల), మార్చి 23 : బ్రహ్మోత్సవాల్లో భాగంగా కందూరు రామలింగేశ్వరస్వామికి శనివారం రుద్రాభిషేకం చేశారు. టీటీడీ శైవాగమ పండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామికి గవ్యాంత పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నిత్యాపాసన, రుద్ర హోమం, నిత్యబలిహరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మంగళ వాయిద్యాలు, భజనలు చేస్తూ ప్రభోత్సవం, అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించారు.

బోర్లా దండాలు పెడుతున్న రాజ్‌గిరిమ హరాజ్

బోర్లా దండాలతో రామేశ్వరానికి యాత్ర

కొత్తకోట, మార్చి 23 : లోక కల్యాణార్థం గతేడాది ఏప్రిల్ 14న ఉత్తరాఖండ్‌లోని గంగోత్రికి చెందిన రాజ్‌గిరి మహరాజ్ బోర్లా పడుకుని దండాలు పెడుతూ రామేశ్వరానికి యాత్ర ప్రారంభించాడు. ఈ యాత్ర శనివారం కొత్తకోటకు చేరుకోవడంతో రాజ్‌గిరి మహరాజుకు పట్టణవాసులు స్వాగతం పలికారు. ఆయనకు వాటర్ బాటిళ్లు, నగదును సైతం అందజేసి యాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు, రాజుసాగర్, రాములు, లాలునాయుడు, రవి, గోవర్ధన్, మన్యం తదితరులు పాల్గొన్నారు.

బాలింతను బలిగొన్న నిర్లక్ష్యం

- సకాలంలో స్పందించని అచ్చంపేట ప్రభుత్వ దవాఖాన వైద్యులు
- గాంధీకి తరలిస్తుండగా మృతి

అమ్రాబాద్, మార్చి 23 : వైద్యుల నిర్లక్ష్యం కారణంగా బాలింత మృతి చెందిన ఘటన అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన మేడమోని కల్పన(29)కు శుక్రవారం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త ఆంజనేయులు అచ్చంపేట వంద పడకల దవాఖానకు తీసుకొచ్చాడు. కాగా తన ప్రైవేట్ క్లినిక్‌లో ఆమె చూయించుకోలేదనే అక్కసుతో ఓ డాక్టర్ ప్రసవం చేయడానికి నిరాకరించినట్లు ఆంజనేయులు తెలిపారు. దీంతో కల్పన వేదన చూడలేక పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తే రూ.35వేలు తీసుకుని సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనివ్వగా శిశువు క్షేమంగా ఉన్నా బాలింతకు రక్తస్రావం కావడంతో జిల్లా దవాఖానకు తీసుకెళ్లాలని ప్రైవేట్ హాస్పిటల్ సిబ్బంది సూచించారు. అక్కడికి వెళ్లగా బాలింతను పరీక్షించిన వైద్యులు గర్భసంచి తొలగిస్తే రక్తస్రావం తగ్గుతుందని చెప్పడంతో ఆపరేషన్‌కు ఒప్పుకొన్నారు. అయితే ఆపరేషన్ చేసినా రక్తస్రావం తగ్గకపోవడంతో వైద్యులు తనతో బలవంతంగా కొన్ని కాగితాలపై సంతకాలు చేయించుకున్నట్లు ఆంజనేయులు తెలిపాడు. బయట కొన్ని పరీక్షలు చేయించాలని చెప్పి బాలింతను అంబులెన్స్‌లోకి ఎక్కించగా.. ఆమె చనిపోయిందని ఆంజనేయులు గ్రహించి వారితో వాదనకు దిగినా వైద్యులు వినకుండా ఆక్సిజన్ పెట్టి గాంధీ దవాఖానకు తీసుకెళ్లమని చెప్పారు. కాగా అక్కడికి వెళ్లగానే వైద్యులు పరిశీలించి కల్పన మృతి చెందినట్లు నిర్ధారించారు. అచ్చంపేట ప్రభుత్వ దవాఖాన వైద్యులు సకాలంలో స్పందించి ఉంటే తన భార్య చనిపోయేది కాదని ఆంజనేయులు ఆరోపించాడు. తన భార్య మృతికి కారణమైన వారిపై విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని మృతురాలి భర్త, కుటుంబసభ్యులుప్రభుత్వాన్ని కోరారు.

బ్యాట్ పడితే పరుగుల వరదే..

- రంజీ క్రికెట్‌కు ఎదిగిన యువ కెరటం గణేశ్
- ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు..
- పేద కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి..
- మహబూబ్‌నగర్ నుంచి 20 ఏండ్ల తర్వాత ఘనత సాధించిన యువకుడు

భారత జట్టుకు ఆడాలన్నదే లక్ష్యం..

జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజశేఖర్ కృషి, కోచ్ అబ్దుల్లా సార్ ఇచ్చిన శిక్షణ వల్లే రంజీ జట్టుకు ఎంపికయ్యాను. రంజీ ట్రోఫీ సీనియర్ క్రీడాకారులు తిలక్‌వర్మ, సీవీ మిలంద్, రాహుల్‌సింగ్ సూచనలు, సలహాలు తీసుకున్నాను. ఐపీఎల్ తప్పక ఆడుతా.. భారత జట్టుకు ఆడాలన్నదే నా లక్ష్యం.

- గణేశ్, రంజీ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

ఇన్నాళ్లకు ఫలితం దక్కింది..

మహబూబ్‌నగర్ నుంచి 20 ఏండ్ల కిందట గౌస్‌బాబా రంజీ ట్రోఫీ ఆడాడు. తను జిల్లా క్రికెట్ సంఘం బాధ్యతలు చేపట్టి 15 ఏండ్లు అయ్యింది. ఎంతో మంది క్రీడాకారులను తయారు చేశాం. రంజీ ట్రోఫీకి గణేశ్ ఎంపికయ్యేందుకు కృషి చేశాం. గణేశ్ కష్టపడి భారత జట్టుకు ఎంపిక కావాలన్నదే తమ లక్ష్యం. మరింత మంది క్రీడాకారులను తయారు చేసేందుకు కృషి చేస్తున్నాం.

- రాజశేఖర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, మహబూబ్‌నగర్

మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ (బైక్)తో గణేశ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 23 : నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు రంజీస్థాయికి ఎదిగాడు. ఆర్థిక స్థోమత లేకపోయినా క్రికెట్‌పై కుమారుడి ఆసక్తిని చూసి తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పరిధిలోని అన్ని ఏజ్ గ్రూపులు అండర్-14, 16,19, సీనియర్స్ విభాగాల్లో ఆడి ప్రతిభ చాటాడు ఉమ్మడి జిల్లా పరిధిలోని మరికల్ మండలం వెంకటాపురానికి చెందిన గణేశ్. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన హెచ్‌సీఏ జోనల్స్ పోటీల్లో సత్తాచాటి ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీ పోటీల్లో పాల్గొనే హెచ్‌సీఏ జట్టుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి హైదరాబాద్‌లో మిజోరాం జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ పోటీల్లో హెచ్‌సీఏ జట్టు తరపున 15మంది తుది జట్టు సభ్యుల్లో చోటు దక్కించుకొని 20ఏండ్ల తర్వాత రంజీ ట్రోఫీలో చోటు దక్కించుకొని రికార్డు నెలకొల్పాడు. ఈయన ఎదుగుదలలో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్ కృషి ఉన్నది.

నిరుపేద కుటుంబం..

గణేశ్‌ది నిరుపేద కుటుంబం, తండ్రి రమేశ్ హమాలీగా పనిచేస్తుండగా, తల్లి సుధ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరు 15 ఏండ్ల కిందట మహబూబ్‌నగర్‌కు వలసవచ్చారు. ఎంతో ఖరీదైన ఆట క్రికెట్‌పై ఆసక్తి చూపడం.. అందుకు అవసరమైన వేలాది రూపాయల కిట్లు కొనుగోలు చేయలేని పరిస్థితి తల్లిదండ్రులది. అయితే అప్పోసప్పో చేసి కుమారుడిని మైదానానికి పంపించారు. ఈయనలోని ప్రతిభను గుర్తించి క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ ప్రోత్సాహం అందించారు. కోచ్ అబ్దుల్లా ఆధ్వర్యంలో క్రికెట్‌లో శిక్షణ పొందాడు.

జోనల్స్‌లో సత్తాచాటి..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పరిధిలో 2023-24 సీజన్‌లో నిర్వహించిన జోనల్స్ పోటీల్లో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టు తరపున ఆడి రాణించాడు. రెండు మ్యాచ్‌ల్లోని రెండు ఇన్నింగ్స్‌లలో 350 పరుగులు చేశాడు. సెక్రటరీ ఎలెవన్ జట్టుతో నిర్వహించిన మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్ 137, రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులతో రాణించాడు. సికింద్రాబాద్ ఎలెవన్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ 49, రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. మొదట హెచ్‌సీఏ మెయిన్ టీంలో స్టాండ్‌బైగా ఉన్నాడు. ఆ తర్వాత ఫిబ్రవరి 17నుంచి 5 రోజుల పాటు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో మిజోరాం జట్టుతో ఆడిన ఫైనల్స్‌లో సత్తాచాటి హెచ్‌సీఏ తుది జట్టుకు ఎంపికయ్యాడు.

పరుగుల వరద పారించాడిలా..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 3డే, 2డే లీగ్ టోర్నీలతోపాటు ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాణించాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన 3డే లీగ్ పోటీల్లో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టులో చోటు దక్కించుకున్నాడు. గత ఏడాది జూలై 2022-23 సీజన్‌లో జరిగిన హెచ్‌సీఏ జోనల్స్ టోర్నీలో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టు తరపున రెండు మ్యాచుల్లో 287 పరుగులు, 2 వికెట్లు తీశాడు. ఇన్‌కం టాక్స్‌శాఖ జట్టుపై 104 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 61 పరుగులు చేశాడు. ఇండియన్ సిమెంట్ జట్టుపై 44 పరుగులు, ఎవర్‌గ్రీన్ క్లబ్ జట్టుపై 36పరుగులు, ఒక వికెట్ తీశాడు. యూబీఐ జట్టుపై 33పరుగులు, ఈస్ట్‌మారెడ్‌పల్లి జట్టుపై 9 పరుగులు ఒక వికెట్ తీశాడు. 2020లో నిర్వహించిన 3డే లీగ్‌లో 8 మ్యాచుల్లో 609 పరుగులు చేసి, ఆరు వికెట్లు పడగొట్టాడు. ఇదే ఏడాది నిర్వహించిన 2డే లీగ్‌లో జిల్లా జట్టు తరపున ఆడి రాజు క్రికెట్ క్లబ్ జట్టుపై 318 నాటౌట